

# సూర్య


నేటి దినపత్రిక

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం,14 జనవరి 2026 | 8 పేజీలు




## ఇంజనీర్లే ఇన్వెస్టర్లు..

# కాంట్రాక్టర్లే బినామీలు

### ఉభయ గోదావరి ఆర్&బిలో కోట్ల 'సిండికేట్' దందా!

- జీవోల ముసుగులో మెగా స్కామ్..లీడ్ మాయాజాలంతో ప్రజాధనం లూటీ..
- అధికారుల ముసుగులో కోట్లకు పడగలెత్తిన నల్ల కుబేరులు!
- కాంట్రాక్టర్లకు అమ్ముడుపోతున్న సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా ప్రజల భావన
- హాట్ ప్లాంట్ సిండికేట్.. చిన్న కాంట్రాక్టర్లు గొంతు కోస్తున్న బడా కోటరీ
- చాలా పెద్ద ప్రమాదంలో అవినీతి ఇంజనీర్లు..!



ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి కేటాయించే వేల కోట్ల ప్రజాధనం ఉభయ గోదావరి జిల్లాల్లోని ఆర్&బి శాఖలో అధికారుల అక్రమ సంపాదనకు మార్గంగా మారింది. ఇక్కడ కొందరు ఇంజనీర్లు దశాబ్ద కాలంగా ఒకే ప్రాంతంలో తిష్టవేసి, నిబంధనలకు విరుద్ధంగా తమ నల్లధనాన్ని కాంట్రాక్టర్ల పనుల్లోనే పెట్టుబడిగా పెడుతూ 'నల్ల కుబేరులు'గా అవతరించారు.ఎస్టిమేషన్ల తయారీలో లీడ్ ఛార్జీల మాయాజాలం నుండి, 100/120 హాట్ ప్లాంట్ మిక్సర్ల ముసుగులో చిన్న కాంట్రాక్టర్లను అడ్డుకోవడం వరకు అంతా ఒక పకడ్బందీ 'కోటరీ'గా సాగుతోంది. రాజకీయ అండదండలతో తక్కువ రేటుకు టెండర్లు వేసే వారిని బెదిరిస్తూ, అధిక ధరలకే పనులు దక్కించుకుంటున్న ఈ వ్యవస్థలో ఏజీ ఆడిట్ మరియు ఏపీ ఫైనాన్స్ కోడ్ సెక్షన్ 151 వంటి జవాబుదారీతనం పూర్తిగా కనుమరుగైంది.కంచె లాగా ఉండి అభివృద్ధిని పర్యవేక్షించాల్సిన అధికారులే బినామీల పేర్లతో ఆస్తులు కూడబెడుతూ, వ్యవస్థను వేళ్ళతో సహా పెకిలించి వేస్తున్న ఈ భారీ కుంభకోణంపై తక్షణమే ఏసీబీ దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

- మిగతా 2 లో..

## కోనసీమ చరిత్రలో

# 'ఆత్రేయపురం ఉత్సవం' అజరామరం!

- సంక్రాంతి సంబరాల్లో కొత్త చరిత్ర..
- టూరిజం పురోగతికి 'డ్రాగన్ పడవలు' ఊతం!
- గోదావరి తీరాన అంబరాన్నంటిన ఉత్సాహం..
- విజేతలకు బహుమతులు అందజేసిన కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ





కోనసీమ పర్యాటక రంగంలో సరికొత్త శకం ఆరంభమైంది. సంప్రదాయ సంక్రాంతికి అంతర్జాతీయ హంగులను జోడిస్తూ ఆత్రేయపురం గోదావరి తీరాన నిర్వహించిన డ్రాగన్ పడవల పోటీలు చరిత్రలో నిలిచిపోయాయి. కోడి పందాలకే పరిమితం కాకుండా,మనసంస్కృతిని మరియు క్రీడా స్ఫూర్తి ని ప్రపంచానికి చాటిచెప్పేలా సాగిన ఈ ఉత్సవం జన సముద్రాన్ని తలపించింది. కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుల ఆధ్వర్యంలో విజేతలకు భారీ నగదు బహుమతులు అందజేయడంతో ఉత్సవం ముగిసింది. క్రీడాకారుల కేరింతలు, పర్యాటకుల ఉత్సాహంతో గోదావరి జిల్లాల్లో మునుపెన్నడూ లేని విధంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి.ఈ పోటీలను ఏటా నిర్వహిస్తూ కోనసీమను గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో నిలబెడతామన్న కూటమినాయకులహామీతోస్థానికుల్లోహర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

- మిగతా 2 లో..

## భోగభాగ్యాల భోగి

# పండుగ విశిష్టత ఇదీ!



సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించే ముందు వచ్చే అద్భుతమైన పండుగ 'భోగి'.కేవలం చలిమంటల పండుగగానే కాక,ఆరోగ్యం,త్యాగం,ఆధ్యాత్మికత కలగలిసిన విశేషమైన రోజు ఇది.

**ముఖ్య విశేషాలు:**

**-భోగి మంటలు - ఆరోగ్యం:** ఔషధ గుణాలున్న కట్టెలు, పిడకలతో వేసే భోగి మంటల వల్ల గాలి శుద్ధి అవుతుంది. ఆ వేడి నీటితో అభ్యంగన స్నానం చేయడంవల్ల వాత సంబంధిత అనారోగ్యాలు తొలగి శరీరం నూతనోత్సాహాన్ని పొందుతుంది.

**- త్యాగమే భోగం:** తాను పండించిన పంటను ఇతరులకు, యాచకులకు పంచడంలోనే అసలైన రాజభోగం ఉందని ఈపండుగ చాటిచెబుతుంది ."తానొక్కడే తినడం రోగం..పదిమందికీ పెట్టడం భోగం" అనేదే ఈ పండుగ అంతరార్థం.

**-పిల్లల కోసం భోగి పళ్లు:** చిన్నపిల్లలపై రేగి పళ్లను కుమ్మరించడం వల్ల సూర్యుడి ఆశీస్సులు, ఆరోగ్యం లభిస్తాయి. బొమ్మల కొలువుల ద్వారా పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుంది.

- తరువాయి 2లో..

# ఇంజనీర్లే ఇన్వెస్టర్లు.. కాంట్రాక్టర్లే బినామీలు





**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

రహదారులు అభివృద్ధి చెందితేనే ప్రాంతం ప్రగతి పథంలో పయనిస్తుంది .కానీ ఉమ్మడి తూర్పు మరియు పశ్చిమగోదావరి జిల్లాలలో రహదారులు భవనాల శాఖ మాత్రమే అవినీతి నిలయంగా మారింది. ఈ రెండు జిల్లాల్లోని కొందరు ఇంజనీర్లు బడా కాంట్రాక్టర్లతో చేతులు కలిపి ఒక అజేయమైన కోటరిగా ఏర్పడ్డారు. ఇక్కడ రోడ్లు వేయడం అంటే ప్రజల సౌకర్యం కోసం కాదు అధికారుల నల్లధనాన్ని రీసైక్లింగ్ చేయడం కోసమే అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

**ఏజీ ఆడిట్ వ్యవస్థకు 'చరమగీతం':**

**నిబంధనల ఉల్లంఘన కాదు.. రాజ్యాంగబద్ధ వ్యవస్థపై దాడి!**

రెండు జిల్లాల్లోనూ ఏజీ ఆడిట్ వ్యవస్థను అధికారులు చుట్టపుచూపుగా మార్చేశారు. ఇది కేవలం పొరపాటు కాదు, పక్కాగా స్కెచ్ వేసి చేస్తున్న వ్యవస్థాగత దోపిడీ.

– ఏపీ ఫైనాన్షియల్ కోడ్ సెక్షన్ 151 సమాధి: ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్ వాల్యూమ్–1 లోని సెక్షన్ 151 ప్రకారం.. ప్రతి అధికారి ప్రజాధనం విషయంలో తన సొంత డబ్బు లాగే బాధ్యత వహించాలి. కానీ ఇక్కడ 'సూపర్ విజన్' పేరుతో ఏఈ నుండి ఎస్ఈ వరకు అంతా కమీషన్ల పంపకాల్లో బిజీగా ఉన్నారు. క్షేత్రస్థాయిలో నాణ్యతను తనిఖీ చేయాల్సిన అధికారులు, ఏసీ గదుల్లో కూర్చుని కాంట్రాక్టర్లు రాసిచ్చిన రీకార్డింగ్ లను 'ఎం–బుక్'లో ఎక్కించడం రాజ్యాంగ విరుద్ధం.

– బిఎన్ఎస్ సెక్షన్ 316 / ఐపిసి 409 కింద నేరం: ప్రజాధనాన్ని రక్షించాల్సిన బాధ్యత కలిగిన పబ్లిక్ సర్వెంట్, ఆ ధనాన్ని దుర్వినియోగం చేయడం లేదా కాంట్రాక్టర్లకు మేలు చేసేలా తప్పుడు రికార్డులు సృష్టించడం "క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్టు" కిందకు వస్తుంది. పనులు జరగకుండానే బిల్లులు చెల్లించడం, తప్పుడు వోచర్లు సృష్టించడం ఏడేళ్ల నుండి జీవిత ఖైదు పడే నేరమని అధికారులు మర్చిపోయారు.

– ఏజీ ఆడిట్ అపహాస్యం: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 149–151 ప్రకారం మరియు కాగ్ డిపిసి చట్టం 1971 నిబంధనల ప్రకారం జరగాల్సిన ఏజీ ఆడిట్‌ను అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. పాత మెటీరియల్‌నే కొత్తగా చూపిస్తూ, 'రీ–సైక్లింగ్' బిల్లులు సృష్టించి, ఆడిట్ అబ్జెక్షన్లు రాకుండా అధికారులను మేనేజ్ చేసే స్థాయికి ఈ అవినీతి సామ్రాజ్యం విస్తరించింది. లోకల్ ఫండ్ ఆడిట్ మరియు ఇంటర్నల్ ఆడిట్ విభాగాలను డమ్మీలుగా మార్చేసి, వేల కోట్ల దోపిడీకి గేట్లు తెరిచారు.

అంచెలంచెలుగా 'అవినీతి' సోపానపటం: ఎస్టిమేషన్ల మాయ

ఈ రెండు జిల్లాల్లోనూ అవినీతికి పునాది ఒకేలా పడుతోంది.

– లీడ్ కుంభకోణం: మెటీరియల్ సమీపంలోనే ఉన్నా, సుదూర ప్రాంతాల నుండి రవాణా చేస్తున్నట్లు తప్పుడు లెక్కలు రాసి కోట్లాది రూపాయల 'లీడ్ణ ఛార్జీలను కాజేస్తున్నారు.

– గ్రౌండ్ లెవల్ ఎస్టిమేషన్లు: కాంట్రాక్టర్ల ఆఫీసుల్లో కూర్చుని ఇంజనీర్లు ఎస్టిమేషన్లు తయారు చేస్తున్నారు. పశ్చిమ గోదావరిలో కూడా ఇష్టానుసారంగా క్వాంటిటీలను చూపిస్తూ ప్రభుత్వ ఖజానాను లూటీ చేస్తున్నారు.

**హాట్ ప్లాంట్ 'ముసుగు' – చిన్న కాంట్రాక్టర్ల పట్ల కనికరం లేదు**

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో రహదారి పనులు దక్కాలంటే 100/120 హెచ్ఎంపి సామర్థ్యం కలిగిన బ్యాచ్ టైప్ హాట్ మిక్చర్ ప్లాంట్ ఉండాలనే నిబంధన ఒక శాపంగా మారింది.

– నిబంధన వెనుక కుట్ర: 19–06–2017 నాటి జివో ఆర్‌టి నెం 180 టిఆర్ & బిఆర్ 1 ప్రకారం, పని జరిగే ప్రాంతం నుండి 100 కి.మీ. పరిధిలో సొంత లేదా లీజు ప్లాంట్ ఉండాలి. టెండర్ దారుడు దీనికి సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధృవీకరించిన సర్టిఫికేట్‌ను అప్‌లోడ్ చేయాలి.

– కోటరీ గుత్తాధిపత్యం: ఈ ప్లాంట్లు కేవలం కొందరు బడా కాంట్రాక్టర్ల వద్దే ఉండటంతో, వారు సిండికేట్‌గా మారి పనులను 'ఎక్సెస్ రేట్ణ కు దక్కించుకుంటున్నారు. చిన్న కాంట్రాక్టర్లు టెండర్లు వేయకుండా లీజు ఒప్పందాలను అడ్డుకుంటూ రాజకీయ బెదిరింపులకు పాల్పడుతున్నారు.

**ఇంజనీర్లే ఇన్వెస్టర్లు – నల్ల కుబేరులుగా మారిన అధికారులు**

ఈ రెండు జిల్లాల్లో కొందరు ఇంజనీర్లు తమ హెూదాను అడ్డం పెట్టుకుని కోట్లాది రూపాయలు గడించారు.

– నల్లధనం రీసైక్లింగ్: అవినీతి ద్వారా సంపాదించిన డబ్బును నేరుగా కాంట్రాక్టర్ల పనుల్లోనే పెట్టుబడిగా పెడుతున్నారు. కాంట్రాక్టర్లతో బహిరంగంగా చట్టపట్టాలు వేసుకొని తిరుగుతున్న వీరు 'సైలెంట్ పార్టనర్స్'గా మారి పర్యవేక్షణను గాలికి వదిలేశారు. దీనివల్ల పనుల్లో నాణ్యత పూర్తిగా లోపించింది.

– ఆస్తుల కూడబెట్టడం: రాజమండ్రి, కాకినాడ, తుని, ప్రత్తిపాడు, ఏలూరు, భీమవరం, తణుకు మరియు విజయవాడ హైదరాబాద్‌లో బినామీల పేర్లతో ఖాళీ స్థలాలు, పొలాలు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మిస్తూ నల్లధనాన్ని భద్రపరుస్తున్నారు.

**బదిలీల ఉల్లంఘన: దశాబ్దాలుగా ఒకే చోట 'తిష్ట'**

అధికారులు ఉమ్మడి తూర్పు నుండి పశ్చిమకు, పశ్చిమ నుండి తూర్పుకు 'మ్యూజికల్ ఛైర్స్' ఆడుతున్నారే తప్ప గోదావరి జిల్లాలను వదలడం లేదు. కొత్త రక్తం లేదా నిజాయితీ గల అధికారులను రానివ్వకుండా పాత కోటరీయే దశాబ్దాలుగా పాతుకుపోయి వ్యవస్థను ఆక్యుపై చేసింది.

**ప్రజాక్షేత్రంలో వెలికితీయాల్సిన వాస్తవాలు**

గోదావరి జిల్లాల రహదారుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండటానికి ప్రధాన కారణం ఈ 'అధికారి–కాంట్రాక్టర్–రాజకీయ' త్రయం. ఏసీబీ మరియు ఈడీ ఈ అధికారుల ఆస్తులపై, బదిలీల హిస్టరీపై లోతైన విచారణ చేపడితే వందల కోట్ల కుంభకోణం బయటపడటం ఖాయం. ఏం జరుగుతుందో వేచి చూద్దాం.

# అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్ కూరుకుపోయింది

- **జగన్మోహన్‌రెడ్డి అమలు చేసింది సంక్షేమ, అభివృద్ధి క్యాలెండర్**
- **కూటమి ప్రభుత్వానిది అప్పుల క్యాలెండర్**
- **పిఠాపురం వైసిపి ఇన్చార్జి, మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రోజురోజుకు అప్పుల ఊబిలో కూరుకుపోతుందని, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధి సంక్షేమ క్యాలెండర్‌ను అమలు చేస్తే, ప్రస్తుత చంద్రబాబు నేతృత్వంలోనే కూటమి ప్రభుత్వం అప్పుల క్యాలెండర్‌ను అమలు చేస్తుందని పిఠాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపిఇంచార్జ్, మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు ఏ సంక్షేమ పథకం ఇవ్వాలి, ఎప్పుడు ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఒక క్రమ పద్ధతిలో క్యాలెండర్ ను విడుదల చేసి పక్కాగా అమలు చేశారని, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎప్పుడు ఎక్కడనుండి ఎంత అప్పు తేవాలని క్యాలెండర్ వేసుకుని అప్పులు చేస్తూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెడుతున్నారని విమర్శించారు. శాంతి భద్రతలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టుకోల్పోయిందని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా... అనేక దారుణాలు జరుగుతున్నాయన్నారు. నాయకులు పర్యటించేటప్పుడు ప్రజా ప్రతినిధులను హౌస్ అరెస్టు చేసి పర్యటించిన దాఖలాలు పిఠాపురంలో గతంలో ఎప్పుడూ చూడలేదని, ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురంలో పర్యటించినప్పుడు ప్రజలచే ఎన్నుకోబడిన కౌన్సిలర్లనుప్రజలచే ఎన్నుకోబడిన కౌన్సిలర్లను, నాయకులను కట్టుబట్టలతో ఉన్నఫలంగా అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఎక్కడుందని, ప్రజాస్వామ్ రాష్ట్రంలో లేదు అనడానికి మొన్న పిఠాపురంలో జరిగిన సంఘటనే ఉదాహరణ అన్నారు. స్కూల్ లు, కాలేజీలు హాస్టల్ వంటి వాటిని సైతం ప్రైవేటు పరం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు వార్తలు వినవస్తున్నాయని, అది ఎంతవరకు నిజమో తెలియదు గాని అదే నిజమైతే బ్రిటిష్ పాలన మరొకసారి తెచ్చినట్లేనని వ్యాఖ్యానించారు.

## భోగభాగ్యాల భోగి పండుగ విశిష్టత ఇదీ!

మొదటిపేజి తరువాయి

**–స్త్రీల సంబరం – గొబ్బెమ్మలు:** ధనుర్మాసం అంతా పూజించిన గొబ్బెమ్మలను భోగిరోజున సాగనంపుతారు.గోదాదేవి,రంగనాథుల కళ్యాణంజరిగిన రోజు కావడంతో ముత్తైదువులు ఎంతో భక్తితో వేడుకలు జరుపుకుంటారు.

**–ఇంద్రపూజ:** వర్షాలకు అధిపతి అయిన ఇంద్రుడిని పూజించి, రాబోయే కాలంలో పాడిపంటలు బాగుండాలని కోరుకోవడం ఈ పండుగ ఆచారం.పాత సామాన్లు,పాత ఆలోచనలను భోగి మంటల్లో ఆహుతి చేసి, కొత్త వెలుగులతో ఉత్తరాయణ పుణ్యకాలంలోకి అడుగుపెట్టడమే భోగి సందేశం.

## కోనసీమ చరిత్రలో 'ఆత్రేయపురం ఉత్సవం' అజరామరం!



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

గోదావరి గడ్డపై సంక్రాంతి సంబరాలు కొత్త పుంతలు తొక్కాయి. సంప్రదాయానికి క్రీడా స్ఫూర్తిని జోడిస్తూ నిర్వహించిన 'ఆత్రేయపురం ఉత్సవం' కోనసీమ చరిత్రలో ఒక మరుపురాని ఘట్టంగా నిలిచిపోయింది. మూడు రోజుల పాటు కన్నులపండువగా సాగిన ఈ వేడుకలు, ముఖ్యంగా 'సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ' డ్రాగన్ పడవల పోటీలు పర్యాటక రంగానికి సరికొత్త దిశానిర్దేశం చేశాయి. ఆదివారం జరిగిన ముగింపు వేడుకల్లో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

**క్రీడలే అభివృద్ధికి సోపానాలు: కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ**

ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ, దేశంలోనే సంక్రాంతి పండుగ అత్యంత ఘనంగా జరుపుకునేది గోదావరి జిల్లాల్లోనేనని కొనియాడారు. "కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 'ఖేల్ ఇండియా', 'ఫిట్ ఇండియా' ద్వారా క్రీడలకు పెద్దపీట వేస్తున్నాయి. డ్రాగన్ పడవల పోటీలు శారీరక దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా, పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడతాయి. కోనసీమను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రాజెక్టులను త్వరలోనే చేపడతాం" అని ఆయన హామీ ఇచ్చారు.

**సంస్కృతిని చాటిచెప్పిన ఉత్సవాలు : ఎంపీ హరీష్ మాధుర్**

అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ మాట్లాడుతూ, సంక్రాంతి అంటే కేవలం కోడిపందాలు మాత్రమే కాదని, అది మన సంస్కృతికి ప్రతిబింబమని చాటిచెప్పేలా ఆత్రేయపురం ఉత్సవం సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం కోనసీమ జిల్లాను టూరిజం హబ్‌గా మార్చేందుకు కేంద్ర నిధులతో కృషి చేస్తోందని తెలిపారు.

**చరిత్రలో చిరస్థాయిగా.. : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆత్రేయపురం ఉత్సవ విజయంపై సంతోషం వ్యక్తం చేశారు. "డ్రాగన్ పడవల పోటీలు, ఈత పోటీలు, లొల్ల లాకుల వద్ద ఫుడ్ ఫెస్టివల్, డ్వాక్రా ఎగ్జిబిషన్, గాలిపటాల పోటీలు, సినీ ఆర్కెస్ట్రా.. ఇలా ప్రతి కార్యక్రమం వినూత్నంగా సాగింది. ఆత్రేయపురం కీర్తి అంతర్జాతీయ స్థాయికి చేరింది" అని ఆయన వ్యాఖ్యానించారు.

డ్రాగన్ పడవల పోటీల విజేతలు వీరే!

1000 మీటర్ల విభాగం:– ప్రథమ బహుమతి: బండారు బలగం టీమ్ (ఏలూరు) – రూ2,00,000/–, ద్వితీయ బహుమతి: పల్నాడు టీమ్ – రూ1,00,000/–, తృతీయ బహుమతి: కోనసీమ టీమ్ – రూ.50,000/–

500 మీటర్ల విభాగం:– ప్రథమ బహుమతి: ఎర్రకాలువ టీమ్ (జంగారెడ్డిగూడెం) – రూ70,000/–, ద్వితీయ బహుమతి: కర్నూలు టీమ్ – రూ50,000/–, తృతీయ బహుమతి: పల్నాడు–2 టీమ్ – రూ30,000/–

హైలైట్స్:– విజేతలకు కేంద్రమంత్రి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం.

– లొల్ల లాకుల వద్ద నోరూరించిన గోదావరి వంటకాల ఫుడ్ ఫెస్టివల్

– సహారా బ్యాండ్, సినీ ఆర్కెస్ట్రాతో హెూరెత్తిన ఆత్రేయపురం.

– కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న నాయకులు, కమిటీ సభ్యులు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, యువనేతలు జ్యోతుల నవీన్, బండారు సంజీవ్ మరియు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

# కోడి పందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

**– మండలంలో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలు**

**– తహశీల్దార్ వెంకటలక్ష్మి**






**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు, ఆర్డీఓ కె.శ్రీరమణి సూచనల మేరకు పెద్దాపురం మండల పరిధిలో సాంప్రదాయాల పేరిట కోడి పందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, పశు సంవర్ధక శాఖ అధికారుల ఆధ్వర్యంలో మండలంలోని వీఆర్వోలు, మహిళా పోలీసులు, వార్డు, గ్రామ సెక్రటరీలతో సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, జూదాల నిషేధంపై మండల యంత్రాంగం చేపట్టవలసిన కార్యాచరణపై చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ తెలుపుతూ జంతువుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టం 1960, ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టం 1974 ప్రకారం కోడి పందాలు, జూదాలు శిక్షార్హమైన నేరమని, కోడిపందాలు నిర్వహణకు వ్యవసాయ భూములు, తోటలు, ప్రైవేటు స్థలాలు ఎక్కడ నిర్వహణకు అనుమతి లేదని, కోడి పందాలు, జూదాల నిర్వహకులతో పాటు వాటిలో పాల్గొనేవారు, ప్రోత్సహించేవారు, బరులు ఏర్పాటు చేసిన భూమి యజమానులు, పందాలు ఒడ్డేవారు, బరుల వద్ద మద్యం విక్రయించేవారు ఈ చట్టం క్రింద కఠిన శిక్షలకు గురి అవుతారని, ఆమె తెలిపారు. మండల స్థాయిలో సమన్వయ కమిటి, అలాగే తహశీల్దార్, పోలీస్, మండల పశు సంవర్ధక శాఖ అధికారి, కానిస్టేబుల్స్, ఫోటోగ్రాఫర్లతో పాటు ఏర్పాటు చేసి బృందాలు కోడిపందాలు, జూదాలపై నిశితమైన నిఘా, విస్తృత తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, తహశీల్దార్ తెలిపారు. గ్రామస్థాయిలో సెక్రటరీలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, మండల స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, కోడి పందాల నిర్వహణకు సంబంధించి సమాచారం తెలిసినవారు ఎవరైనా కంట్రోల్ రూమ్‌కు గాని, మండల టీమ్‌లకు గాని తెలియజేయాలని తహశీల్దార్ తెలిపారు. కోడిపందాలు జరిగే ప్రాంతాలలో భారతీయ నాగరిక సురక్ష సంహిత 2023 సెక్షన్ 163 ప్రకారం ముందస్తు నిషేధ ఉత్తర్వులు అమలులో ఉన్నాయని, తహశీల్దార్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక ఎఎస్సై, పశువైద్యులు డా.గోలి వీర్రాజు, డా.గంగాభవాని, మండలంలోని వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, మహిళా సంరక్షణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా మండలంలోని పలు కోడి పందాల బరులను తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి సమక్షంలో ఎస్సై వి.మౌనిక పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది ధ్వంసం చేయడం జరిగింది.

# సంక్రాంతి పురస్కరించుకుని శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక అలంకరణ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసి యున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు సంక్రాంతి పురస్కరించుకుని, దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో దేవస్థాన సిబ్బంది పూలదండలతో అమ్మవారి దేవస్థానంను అలంకరి ంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా చేతుల మీదుగా అరుణ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థినీ విద్యార్థులకు సన్మానం



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ మరియు సామర్లకోటలో జరిగిన రాష్ట్రీయ మరియు జాతీయ స్థాయి పోటీలో బంగారు, రజిత, కాంస్యం సాధించిన సంధ్యారామణి, పునీషా, శరణ్య మాధురి, ఈసా, నైనా, భవ్య, భవిష్య, ఐశ్వర్య రాణి, సాహితి, జోన్, శ్రీ గణేష్, పూజ, శ్రీ లక్ష్మీ లత, అఖిల, విద్యార్థిని విద్యార్థులకు మన రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా చేతుల మీదగా బంగారం పథకం వేసి సత్కరించారు. బ్లాక్ బెల్ట్ గ్రాండ్ ఛాంపియన్షిప్ పోటీలలో ప్రథమ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్న శ్రీ లక్ష్మీలత మరియు పూజ లకు సాలువ కప్పి గ్రాండ్ ఛాంపియన్షిప్ ట్రోఫీ ప్రధానం చేస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు మరియు తల్లిదండ్రులు మరియు మాస్టర్ పి.అరుణ్ కుమార్ మరియు కోచ్ అనూష, అఖిల పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఇలాంటి బహుమతులు ఇంకా ఎన్నెన్నో మన రాష్ట్రానికి మరియు దేశానికి అందజేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఆడపిల్లలకు ఇలాంటి మార్షల్ ఆర్ట్స్ అవసరమని ఆయన అన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

**– బాధితులకు ప్రభుత్వ సహాయం అందజేత**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రతిపాడు నియోజకవర్గం, రౌతులపూడి మండలంలో గిరిజన గ్రామమైన సార్లాంకలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని నిరాశ్రయులైన 33 గిరిజన కుటుంబాలను మంగళవారం కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరామర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తక్షణ సహాయం కింద ఒక్కో బాధిత కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబాలకు అందజేశారు. సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో 33 గిరిజన కుటుంబాలు సర్వస్వం కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు, కూటమి నాయకులు తక్షణం స్పందించి సహాయ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. బాధితు కుటుంబం సాధారణ స్థితికి చేరుకునే వరకు గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడంతో పాటు, సహాయక చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. దీంతో పాటు బాధితులకు త్వరితగతిన ప్రభుత్వమే పక్కా నివాస గృహాలు నిర్మించడం జరుగుతుందని ఉదయ్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఎంపీ ఉదయ్ వెంట స్థానిక ఎమ్మెల్యే పరుపుల సత్యప్రభ, ప్రత్తిపాడు జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ), కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్రాతి పండుగను ఆనందంగా జరుపుకోవాలి

**– డిఎస్పీ సాయి ప్రశాంత్ – 'లెనోరా'లో ముగ్గులు పోటీలు**





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ప్రజలంతా సంక్రాతి పండుగ ను ఆనందంగా జరుపుకోవాలని రంపచోడవరం డిఎస్పీ జి సాయి ప్రశాంత్ సూచించారు. పోలవరం జిల్లా కేంద్రమైన రంపచోడవరంలో డిఎస్పీ జి.సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో స్థానిక లెనోరా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం పోలీసులు ముగ్గులు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పీ సాయి ప్రశాంత్ మాట్లాడుతూ సాంప్రదాయమైన విధానాల్లో సంక్రాంతి పండుగ జరుపుకోవాలన్నారు. గిరిజన ప్రాంతంలో కోడి పందాలు, పేకాట, ఇతర జూదాలు జోలికి పోవద్దని సందేశాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొని సందేశాత్మకమైన సంక్రాంతి సాంప్రదాయమైన ముగ్గులు వేయడం జరిగింది. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సిఐ ఎన్.సన్యాసి నాయుడు, ఎస్సై వెంకట్రావు, అదనపు ఎస్ఐ భూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్రాంతి ఆటల పోటీలను జయప్రదం చేయండి



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే సంక్రాంతి ఆటల పోటీలను జయప్రదం చేయాలని కోరుతూ ఆటల పోటీల కరపత్రాన్ని ప్రజా సంఘాల నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. యాసలపు సూర్యారావు భవనంలో సంక్రాంతి ఆటల పోటీల కరపత్రాన్ని సిఐటియు నాయకులు సిరపురపు శ్రీనివాస్, ప్రజా నాట్యమండలి కార్యదర్శి రొంగల వీర్రాజు, పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి రొంగల అరుణ్, డివైఎఫ్ఐ నాయకులు రొంగల నరసింహ మూర్తి, అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు పద్మ, సత్యవేణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తెలుపుతూ 14వ తేదిన సూర్యారావు భవనంలో మధ్యాహ్నం 2 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని, 15వ తేదిన వరహాలయ్యపేట–నువ్వులగుంట వీధిలో ఆటల పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కావున ప్రజలందరూ ఈ పోటీలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సూర్య దినపత్రిక
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# గిరిజన మహిళ కుటుంబం వెలి ఘటనపై..
# జిల్లా కలెక్టర్‌కు ఎన్‌సి ఎస్‌టి నుండి నోటీస్





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దిరిసినపల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళ బల్లెం గంగాభవానీ కుటుంబాన్ని వెలివేసిన సంఘటనపై జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ (ఎన్‌సి ఎస్‌టి) నుండి జిల్లా కలెక్టర్ కు నోటీసు ఇచ్చారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు మంగళవారం తెలిపారు. రంపచోడవరం మండలం నర్సాపురం, దిరిసిన పల్లి గ్రామాల పరిధిలోని నల్ల రాయి క్వారీల వలన తమ ఇళ్ళు పాడైపోతున్నాయని, విచ్చలవిడిగా బ్లాస్టింగ్ జరగడం వలన దుమ్ము ధూళి, పంట పొలాలు నాశనం అవ్వడం, భూమి అదరడం వలన ఇళ్ళు, టీవీలు పాడవడం జరుగుతున్నాయని, పర్యావరణ కాలుష్యం వలన ఆరోగ్యం పాడవుతున్నాయని దిరిసిన పల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళ బల్లెం గంగాభవానీ, కొంతమంది బాధితులు కలిసి నవంబర్ 17వ తేదీన రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి ఫిర్యాదు చేసారు. అయితే క్వారీ నిర్వహకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్న కొంతమంది దిరసనపల్లి గ్రామ పెద్దలు బాధిత ఫిర్యాదుదారులను బెదిరించి భయపెట్టి తెల్ల పేపర్ల మీద సంతకం చేసి బాధితులు మాట్లాడకుండా చేశారన్నారు. అయితే బల్లెం గంగా భవానీ కుటుంబం మాత్రం తమ సమస్యలపై పరిష్కారం లభించే వరకు పోరాటం చేస్తామని ధైర్యంగా నిలబడి ఇప్పటికీ పోరాటం చేస్తూనే ఉన్నారు. గతంలో ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని బెదిరించిన కొంతమంది గ్రామ పెద్దలు, 20వేల రూపాయలు జరిమానా కట్టాలని గంగాభవానీ కుటుంబాన్ని బెదిరించడం, మానసికంగా హింసిస్తూ దాడులకు తెగబడ్డరు. అలాగే నవంబర్ 19వ తేదీన గ్రామం నుండి వెలివేస్తున్నట్లు గ్రామ పెద్దలు ప్రకటించడం జరిగింది. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్, ఐటిడిఏ, జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో జిల్లా ఎస్పీకి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేదని బాధితులు పేర్కొన్నారు. దీనిపై బాధితురాలు జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ (న్యూఢిల్లీ) కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన కమిషన్ ఈ సంఘటనపై 30 రోజుల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు నోటీసులు జారీ చేయడం జరిగింది. ఈ నోటీసులు పోస్ట్ ద్వారా అందుకున్న బల్లెం గంగాభవానీ కుటుంబం ఇప్పటికైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తంచేసారు. స్థానిక పోలీస్, ఐటీడీఏ, జిల్లా కలెక్టర్, మైనింగ్ డిపార్ట్మెంట్ నిర్లక్ష్యం కారణంగానే తమకు అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తంచేసారు. విచారణ పేరుతో వచ్చిన రంపచోడవరం ఎమ్మార్వో, మైనింగ్ ఏడి పాడేరు వారు నవంబర్ 24వ తేదీన తమ కుటుంబంపై తమకు అండగా నిలిచిన ఆదివాసి నాయకులపై ప్రజలను రెచ్చగొట్టి దాడి చేయించారని, ఈ విషయంపై జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ కు ఫిర్యాదు చేసామని బల్లెం గంగా భవానీ తదితరులు ఈ సందర్భంగా తెలియజేశారు.



# నడుపల్లి పంచాయతీ సిబ్బందికి సంక్రాంతి కానుక

**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవల్లి మండలం నడిపల్లి గ్రామ సచివాలయం నందు సంక్రాంతి సందర్భంగా జనవరి 13వ తేదీ మంగళవారం పంచాయతీ సిబ్బంది గ్రీన్ అంబాసిడర్స్ కు మరియు గుమాస్తాలకు పండుగ సందర్భంగా నూతన దుస్తులు కొనుగోలు కొరకు ఒక్కొక్కరికి 2000 చొప్పున పండుగ కానుకగా గ్రామ సర్పంచ్ బీర సత్యవేణి రాజు ఇవ్వటం జరిగినది.

# ఐ.ఎం.ఎ. ఆధ్వర్యంలో సంక్రాంత్రి సంబరాలు






**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రస్తుత కంప్యూటర్ యుగంలో నానాటికి మరుగున పడుతు మన సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియ జేసేందుకు ఐ.ఎం.ఎ. ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వ హించినట్లు ఐ.ఎం.ఎ ప్రెసిడెంట్ డా.కాదా వెంకటరమణ, ఐ.ఎం.ఎ. వుమెన్స్ వింగ్ చైర్మన్ డా.సత్యవతి తెలిపారు. కాకినాడ ఎన్.ఎఫ్.సి.ఎల్. రోడ్లో గల ఐ.ఎం.ఎ. హాల్లో ఐ.ఎం.ఎ. వుమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. నిత్యం పెషెంట్స్‌తో బిజిబిజీగా ఉండే డాక్టర్స్ అంత ఒక్కసారిగా సాంప్రదాయాలకు విలువను ఇస్తూ సాంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి సంబరాలకు హాజరైయ్యారు. సంక్రాంతి సంబరాలను ఐ.ఎం.ఎ. ప్రెసిడెంట్ డా.కాదా వెంకట రమణ ప్రారంబించారు. ఐ.ఎం.ఎ. ఎదుగురగా గల గ్రౌండ్లో పల్లె వాతవరణాన్ని తలపించే విధంగా ఎడ్లబండి రంగురంగుల జెండాలతో అలంకరించారు. అందులో బాగంగా మహిళా వైద్యులు వేసిన రంగవల్లుల పోటీలలో ముగ్గులను ఐ.ఎం.ఎ. ప్రెసిడెంట్ డా.వెంకటరమణ పరిశీలించారు. అనంతరం చిన్నారులకు గాలిపటాల పోటీలను నిర్వహించారు. మహిళా వైద్యులు వారి తయారు చేసిన పిండి వంటలను ప్రదర్శించారు. సంక్రాంతి అంటే గంగిరెద్దులు, హరిదాసులు, డుడు బసవన్నలు, పిట్టల దొరలు ఐ.ఎం.ఎ. ప్రాంగణంలో సందడి చేయగ చిన్నరులు అంత తిలకించి ఆనందంతో కేరింతలు కొట్టారు. నిత్యం ప్రిస్కిప్షన్స్, సర్జరీలు చేసే చేతులు కర్ర చేతపట్టి కర్ర సాము చేసి అందరిని అబ్బురపరిచారు. అదే విదంగా మహిళా వైద్యులు అంత కోలాట నృత్యాలు చేసి సందడి చేసారు. ఈ సందర్భంగా డా.కాదా వెంకటరమణ మాట్లాడుతూ నానాటి అంతరించి పోతున్న మన సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు సంక్రాంతి సంబరాలు నిర్వహించామన్నారు. డా?ఎ.ఎల్.సత్యవతి మాట్లాడుతూ మన పండుగల శాస్త్రీయతను మన భవిష్యత్ తరాలకు తెలియజేయాలసిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. ఈకార్యక్ర మంలో డా.మోకా పవన్ కుమార్, డా.బాబ్జి, డా.విష్ణుమహేష్, డా.జి.ఎస్. మూర్తి, డా.చిట్ల కిరణ్ డా.హర్ష, ఐ.ఎం.ఎ ఉమెన్స్ వింగ్ చైర్మన్ డా.సత్యవతి, సెక్రటరీ డా.మాధవి, సభ్యులు డా.కావ్య డా.రజనీ, డా.జానకి, డా.నిఖిత, డా.కృష్ణవేణి, డా.భానుమతి, డా.జ్యోతిర్మయి, డా. కిన్నెర, డా.స్వప్నిక, డా.మల్లిక, డా.సుష్మా, పెద్ద సంఖ్యలో ఐ.ఎం.ఎ. వైద్యులు పాల్గొన్నారు.

## ఘనంగా లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెల్విన్ జోన్స్ జయంతి వేడుకలు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెల్విన్ జోన్స్ జయంతి వేడుకలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జగ్గంపేట లైన్స్ కంటి ఆసుపత్రి ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ విగ్రహానికి లైన్స్ క్లబ్స్ చైర్మన్ లయన్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసిన లైన్స్ డిస్టిక్ చైర్మన్ కొత్త కొండబాబు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెల్విన్ జోన్స్ లైన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఏర్పాటు చేసి ప్రపంచవ్యాప్తంగా 210 దేశాలలో 14 లక్షల సభ్యులు గల ఏకైక సంస్థ లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ భారతదేశంలో 487 డిస్టిక్ సంస్థ ఉన్నాయనిమెల్విన్ జోన్స్ స్పూర్తితో జగ్గంపేటలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైన్స్ కంటి ఆసుపత్రి డాక్టర్ దయానా వేములపల్లి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు హాజరయ్యి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే డొక్కా సీతమ్మను పవన్ కళ్యాణ్ ఆదర్శంగా తీసుకుంటే తుమ్మలపల్లి రమేష్ పవన్ కళ్యాణ్ స్ఫూర్తి గా తీసుకుని తన సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం నిర్విరామంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారన్నారు. డొక్కా సీతమ్మ కాంటిన్ ద్వారా సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమళ్ళ నాగేశ్వరావు, సత్తి సోమ రాజు, తుమ్మల మనోజ్,అడబాల వీరబాబు, డ్రిల్ మాస్టారు, రామకుర్తి శ్రీమన్నారాయణ, బాబురావు జగ్గంపేట నియోజకవర్గం జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పెరవలి మండలంలో కోడిపందాలపై ఉక్కుపాదం

**- కోడిపందాల బరులు తొలగించిన తహసిల్దార్, ఎస్సై**



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండలంలో సంక్రాంతి సందర్భంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కోడిపందాల బరిలను జనవరి13వ తేదీ మంగళవారం పెరవలి తాసిల్దార్ కే నిరంజన్ పెరవలి ఎస్సై వెంకటేశ్వరరావులు తమ సిబ్బందితో కలిసి తొలగించారు. పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామంలో, అన్నవరప్పాడు సెంటర్లో, పిట్టల వేమవరం గ్రామంలో కోడి పందాలు నిమిత్తం వేస్తున్న బరి లను పెరవలి ఎస్ఐ ఎం వెంకటేశ్వరరావు తో కలిసి వెళ్లి తాసిల్దార్ కే నిరంజన్ తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా వారు కోడిపందాలకు గుండాట పేకాటలకు ఏ విధమైన పర్మిషన్లు లేవని వాటిని నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఒక్క ఛాయాచిత్రంతో 50 ఏళ్ళు వెనక్కి తీసుకువెళ్ళారు





**– నాటి బాలుడే .. నేటి నేత.. స్ఫూర్తి దాత..**

**పెరవలి, మేజర్ న్యూస్ :** ఒక్క చాయాచిత్రంతో అందర్నీ 50 ఏళ్ళు వెనక్కి తీసుకువెళ్ళారు. నాటి బాలుడే .. నేటి నేత.. స్ఫూర్తి దాత. వివరాల్లోకి వెళితే జనవరి 12వ తేదీ సోమవారం ఘనంగా జరిగిన ఎస్వికెపి కాలేజ్ స్వర్ణోత్సవ ముగింపు వేడుకలులో 51 సంవత్సరాల క్రితం కాలేజ్ ప్రారంభోత్సవంలో బాలుడిగా పాల్గొన్న ఇప్పుడు ఎమ్మెల్సీ గా ఉన్న వంక రవీంద్రనాథ్ తన తండ్రితో కలిసి ఎస్వికేపీ కాలేజ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అప్పటి ఫోటోను సభికులకు పరిచయం చేశారు. అప్పటి కాలేజ్ నేపద్యాన్ని కాలేజీ ప్రారంభోత్సవ విశేషాలను సభికులతో పంచుకున్నారు. తన తండ్రి అసెంబ్లీ టైగర్ వంక సత్యనారాయణ పెనుగొండ శాసనసభ్యులుగా మూడు పర్యాయాలు సమర్ధవంతంగా పనిచేసిన సంగతి అందరికీ తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల వారికి విద్య అనేది ఎంతో అవసరం అనే ముందు చూపుతో 51 సంవచ్చరాల క్రితం తన తండ్రి అప్పటి పెనుగొండ శాసన సభ్యులు వంక సత్యనారాయణ ఆలోచనల ప్రతిరూపమే యస్వికేపీ కాలేజ్ ప్రారంభం అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న స్వర్ణోత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ తనకు ఈ అవకాశం రావడం పూర్వజన్మ సుకృతం అన్నారు. అప్పటి పెనుగొండ శాసనసభ్యులు వంక సత్యనారాయణ నాటిన ఎస్వికేపి కళాశాల అనేక మంచి వ్యక్తుల ఆధ్వర్యంలో నిష్ణాతులు నిబద్ధత గల ఉపాధ్యాయ, ఇతర అధికారుల సహకారంతో అనేక వేల మంది విద్యార్థులకు మంచి విద్యను అందించింది అని సమాజానికి ఎంతో మంది ఉన్నత ఉద్యోగులను, శాస్త్రవేత్తలను, విద్యావేత్తలను, రాజకీయ నాయకులను అందించింది అని శాసన మండలి సభ్యులు వంక రవీంద్ర నాథ్ అన్నారు. నేడు జరిగిన పెనుగొండ ఎస్వికేపి కాలేజ్ స్వర్ణోత్సవాల ముగింపు కార్యక్రమంలో వంక రవీంద్ర నాథ్ పాల్గొని తాను 8 వ తరగతి చదువుతున్న సమయంలో ఈ కాలేజీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అరుదైన చిత్రాన్ని విద్యార్థులకు సభికులకు ప్రదర్శించారు. అప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పటికి తన తండ్రి వంక సత్యనారాయణ చొరవ తీసుకుని ప్రభుత్వానికి ఇక్కడ కాలేజ్ స్థాపించవలసిన ఉండవలసిన ఆవశ్యకత గురించి చెప్పి ఒప్పించి ఈ కాలేజీని ఏర్పాటు చేశారని రవీంద్రనాథ్ అన్నారు. గ్రామ పెద్దలతో మాట్లాడి అందర్నీ భాగస్వాముల్ని చేసి,స్వతంత్రశీ గా మేనేజింగ్ కమిటీ పనిచేసేలా అన్ని వర్గాల వారిని కలసేలా చేశారు. అప్పటి నుండి ప్రతీ మేనేజింగ్ కమిటీ నిస్వార్థంగా కృషి చేయడం మూలంగా ఈనాడు మూడు వేలమంది విద్యార్థులు ఈ కళాశాలో విద్య నభ్యసిస్తున్నారని చెప్పారు. ఈ కళాశాలలో ఎప్పటికప్పుడు నూతన కోర్స్ లు తీసుకురావడం, విద్యార్థులకు మంచి శిక్షణ ఇప్పించడంలో దీర్ఘకాలం పనిచేసిన డాక్టర్ తమయ్య కృషి అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, కళాశాల యాజమాన్యం చైర్మన్ తాడి నాగిరెడ్డి,సెక్రటరీ కరెస్పాండంట్ డాక్టర్ కె రామచంద్ర రాజు, ట్రెజరర్ లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యువత కోడిపందాలు, గ్యాంబ్లింగ్, పేకాటకు వెళితే కేసులు



**సామర్లకోట, మేజర్‌న్యూస్ :** యువత కోడిపందాలు, గ్యాంబ్లింగ్, పేకాట శిబిరాలు అంటూ వెళితే కేసులు పెడతామని సామర్లకోట సర్కిల్ ఇన్స్పె క్టర్ కృష్ణ భగవాన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ తమ ఇళ్ల వద్ద కుటుంబ సమేతంగా సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని సామర్లకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ భగవాన్ కోరారు. యువత కోడిపందాలు, గ్యాంబ్లింగ్, పేకాట శిబిరాలు అంటూ వెళితే కేసులు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కృష్ణ భగవాన్ హెచ్చరించారు. సంక్రాంతికి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తమ తమ ఇళ్ల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సీసీ కెమెరాల భద్రత, పోలీస్ సహాయం పొందాల న్నారు. ప్రయాణాల్లో నగలు నగదుపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని కృష్ణ భగవాన్ కోరారు.

## రైతు వ్యతిరేక కేంద్ర చట్టాల కాపీలను భోగి మంటల్లో వేయండి

**ఏలూరు,మేజర్ న్యూస్ :** రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లు,వివిజి రామ్ జి గ్రామీణ ఉపాధి పథకం చట్టం,విత్తన చట్టం వంటి కేంద్ర చట్టాలను భోగిమంటల్లో వేసి నిరసన వ్యక్తం చేయాలని జిల్లా రైతులకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమావేశం పిలుపునిచ్చింది. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు,ప్రజలకు వ్యతిరేకంగా కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడే విధంగా అనేక చట్టాలు తీసుకువస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

# నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే శాఖపరమైన చర్యలు తప్పవు

**– కోడి పందాలు, గుండాటలు,**
**మద్యం అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు**
**– ఎస్ఐ శివకుమార్**



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్:** పోలవరం జిల్లా రంప చోడవరం నియోజకవర్గం రాజవొమ్మంగి స్టేషన్ పరిధి లోని గ్రామాల్లోకోడి పందాలు, గుండాటలు, మద్యం అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై శివకుమార్ హెచ్చరించారు. హైకోర్టు ఉత్తర్వులుమేరకు ఎవరైనా ఆడిన వాటిని ప్రోత్సహించిన సంక్రాంతి పండగకు కోడి పందేలు నిర్వహిస్తే జంతుహింస నిరోధక చట్టం 1960, ఎపి జూద నిరోధక చట్టం –1974 కింద చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పిలను హైకోర్టు ఆదేశించిందని, ఈ మేరకు పోలవరం జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, ఆదేశాల మేరకు మండలంలో కోడిపందాలు నిర్వహిస్తేకఠిన చర్యలు తీసుకొని కేసులు పెడతామని ఎస్సై శివకుమార్ పత్రికా ముఖంగాతెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహిండం జరుగుతు ందన్నారు. ఈ సంక్రాంతి పండగలు మూడు రోజులు ప్రతి ఒక్కరు కూడా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అనుగుణంగా నడుచుకోవాల న్నారు.. సంక్రాంతి పండుగను ప్రజలు సంప్రదాయ క్రీడలతోసంతోషంగా, ఆనం దంగా జరుపుకోవాలని ఎస్సై శివకుమార్ కోరారు. మండల పరిధిలో కోడిపందాలు, పేకాట, గుండాట, చిత్తులాట వంటి జూధ క్రీడలు నిర్వహించినా, మద్యం అమ్మకాలు చేపట్టినా ఎంతటి వారిపైనైనా చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక సీఐ గౌరీ శంకర్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగలు కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

## జగనన్న కాలనీ ప్రధాన రహదారి అత్యంత దుర్భరం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట జగనన్న కాలనీలో అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. పండగ సమయంలో ఆ ప్రాంతం మురికి నీటి, బురదమయంగా మారింది. వాటర్ వర్క్స్ పైప్ లైన్‌కు రిపేర్లు పేరుతో జెసిబి ద్వారా పనులు నిర్వహించి, మట్టిని బురదలు అలా రోడ్లపై వదిలేయడంతో ఆ కాలనీ ప్రధాన రహదారి అత్యంత దుర్భరంగా మారింది. చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు బురద నీటి వల్ల జారిపడుతున్నారు. పండగ పూట మరి ఇంత అరాచకమా? అంటూ... ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఒకపక్క తాగునీటి ఇబ్బందులు, మరోపక్క డ్రైనేజీ తిప్పలు, ఇప్పుడు బురద తిప్పలు ఏర్పడ్డాయని వాపోతున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# పిఠాపురం పోలీస్ వారి హెచ్చరిక...

**– కోడి పందాలు, గుండాట, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు**
**– సంక్రాంతిని సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని సూచన**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పోలీస్ వారి హెచ్చరిక... సంక్రాంతి పండుగ సందర్భంగా ఎటువంటి కోడిపందాలు, గుండాట, జూద క్రీడలు నిర్వహించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటాం... అని పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్, పిఠాపురం రూరల్ ఎస్సై ఎస్. కే జానీ భాషా హెచ్చరించారు. పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల... పిఠాపురం రూరల్ మండలం లోని విరవాడ, విరవ మరికొన్ని గ్రామాలలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ వారి ఆదేశానుసారం మరియు కాకినాడ సబ్ డివిజన్ ఎస్ డిపిఓ పాటిల్ దేవరాజ్ మనిష్ వారి ఉత్తర్వుల ప్రకారం పిఠాపురం సర్కిల్ సి ఐ జి. శ్రీనివాసు, పిఠాపురం రూరల్ ఎస్ఐ ఎస్ కే జానీ బాషా మరియు వారి సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో కలిసి పిఠాపురం రూరల్ మండలంలోని కోడి పందాలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రదేశాల్లో పర్యటించి హెచ్చరిక తెలుపుతూ... ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. ప్రజలకు సంక్రాంతి పండుగ సందర్భంగా ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలైన కోడిపందాలు, పేకాట, గుండాట, అశ్లీల నృత్యాలు జరపడానికి వీలులేదని, అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సాంప్రదాయ బద్ధంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## తప్పిపోయిన బాలుడిని అప్పగించిన పోలీసులు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** వైజాగ్ నుండి కాకినాడ వద్దనున్న కరప విజయ రాయుడుపాలెం వెళ్ళుటకు గాను సామర్లకోటలో రైలు దిగిన కుప్పిశెట్టి జానకిరామ్ దేవి దంపతులు రెండున్నర సంవత్సరాల దుష్యంత్ ఆద్య బస్టాండ్ ఏరియాలో తప్పిపోవడం మంగళవారం జరిగింది. వెంటనే తల్లిదండ్రులు స్థానిక ట్రాఫిక్ ఎస్సై అడపగరగా రావు దృష్టికి రాగా, ఎస్. ఐ గరగరావు,సిబ్బంది సీసీ ఫుటేజ్ ఆధారంగా బాబుని గుర్తించి బాబుని తల్లిదండ్రులకు అప్పగించారు. బాబు తప్పిపోయిన నిమిషాల్లో గుర్తించి తల్లిదండ్రులకి అప్పగించిన ఎస్ఐ గరగరావు, సిబ్బందిని పలువురు అభిందించగా, బాబు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్ని దుష్టశక్తులెదురైనా అమరావతి అభివృద్ధి ఆగదు

– పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వి ఎస్ఎన్ వర్మ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఎన్ని దుష్టశక్తులు ఎదురైనా అమరావతి అభివృద్ధి ఆగదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టిడిపి అధికారం ప్రతినిధి ఎస్ వి ఎస్ఎన్ వర్మ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా రాజధానిపై జగన్ కుట్ర బట్టబయలయిందని, ఇద్దరు ఉండే జగన్ కుటుంబానికి వేల ఎకరాలు..? ఐదు కోట్ల ప్రజలకు రాజధాని వద్దా ? అని ప్రశ్నించారు. ఇద్దరు సభ్యులు ఉండే జగన్మోహన్ రెడ్డికి ఐదు వందల ఎకరాల పైగా విలాసవంతమైన భవనాలు ప్యాలస్ లు ఉండాలని, కోట్లాది మంది ప్రజలకు అవసరమయ్యే రాజధాని మాత్రం విశాలంగా ఉండకూడదా అని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డు పెట్టుకొని అమరావతి విధ్వంసానికి పాల్పడిన జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఇంటిలో కూర్చో బెట్టి 18నెలలు అయిన ఆయన తీరులో ఏటువంటి మార్పు రాలేదని విమర్శించారు. 175 నియోజకవర్గాల యువతకు ఉపాధే లక్ష్యంగా అమరావతి నిర్మాణం చేపడుతుంటే జగన్ రెడ్డి మరోసారి తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నాడని, అమరావతి అభివృద్ధిని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న జగన్మోహన్ రెడ్డి.. నేషనల్ మీడియా సాక్షిగా మరోసారి తన వక్ర బుద్ధిని ప్రదర్శించాడన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసిన జగన్.. ఇవాళ రాజ్యాంగంలోని పదాలకు సరికొత్త అర్థాలను వివరిస్తున్నాడని, ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చొని విధులు నిర్వహిస్తే అదే రాజధాని అవుతుందన్న జగన్.. గత ఐదేళ్ళ ఎక్కడ నుంచి పరిపాలన చేశాడో చెప్పాలని, నదీ పరీవాహక ప్రాంతంలో రాజధానిని నిర్మిస్తున్నారని మాట్లాడుతున్న జగన్... దేశ రాజధాని న్యూఢిల్లీ యమునా నది ఒడ్డున, కలకత్తా హుగ్లీ నది ఒడ్డున, గాంధీనగర్ సబర్మతి నది ఒడ్డున, హైదరాబాద్ మూసీ నది ఒడ్డునే ఉన్నాయని గుర్తించు కోవాలన్నారు. నది గర్భంలో కృష్ణా నదిలో ఎక్కడ కూడా నిర్మాణాలు జరగడం లేదని, ప్రజలపై రూపాయి భారం వేయకుండా సెల్ఫ్ ఫైనాన్స్‌తో అమరావతిని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బొజ్జా సతీష్, సకుమళ్ళ గంగాధర్ రావు, బర్ల అప్పారావు, సోము సత్యనారాయణ, అనిశెట్టి సత్యానందరెడ్డి, పిల్లి చిన్న, మడికి ప్రసాద్, దేవరపల్లి రామారావు, అల్లవరపు నగేష్, కోరుప్రోలు శ్రీను, సాన రాంబాబు, పిల్ల సురేష్, అద్దూరి శ్రీను, ఎలుబండి బాబులు, కోల రాజు, కేతరపు కృష్ణ, వరద సత్తిబాబు, వాసంశెట్టి సూరిబాబు, బండి నాగేంద్ర, నెక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో చేనేత పరిశ్రమ... ఆదుకోవాలని వినతి

– చేనేత కులాల సమాఖ్య ఏపీ కన్వీనర్ పంపన రామకృష్ణ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉందని, చేనేత రంగాన్ని తక్షణమే ఆదుకోవాలని చేనేత కులాల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ పంపన రామకృష్ణ కోరారు. స్థానిక సూర్యరాయ గ్రంథాలయ హాలు నందు మంగళవారం పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం చేనేత రంగం అంపశయ్య మీద ఉందని, కార్మికులు వృత్తి లేక ఆకలితో అలమటిస్తున్నారని, దాదాపుగా ఈ పరిస్థితి రాష్ట్ర మంతా ఉందన్నారు. దేశ విదేశాలలో చేనేత వస్త్రాలకు గిరాకీ ఉన్నా, ఈ రంగంలో లాభాలు వచ్చే అవకాశం ఉన్నా... విధానపరమైన లోపాల వలన చేనేత రంగం నష్టాల బాట పట్టిందన్నారు. చేనేత సహకార సంఘాలు ప్రస్తుతం సభ్యులకు ఉపాధి కల్పించలేని స్థితికి చేరుకుని నష్టాల ఊభిలో కూరుకుపోయాయని, చేనేత సహకార సంఘాలకు 13 సంవత్సరాలుగా ఎన్నికలు లేని కారణంగా సహకార సంఘాల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, వెంటనే ఎన్నికలు జరిపించి తద్వారా పాలక మండలిని నియమించి సొసైటీల అభివృద్ధికి సహకరించ చాలని కోరుచున్నా మని, తయారైన బట్టలకు 30% రిబేటు సంవత్సరం పొడవునా వర్తింపచేయాలని, రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేసి తద్వారా చేనేత కార్మికులను (కళాకారులు) ఆదుకోవాలని, పావలా వడ్డీ (25 పైసలు) అమలు చేయాలి, జీఎస్టి మినహాయింపు ఇచ్చి చేనేతను ఆదుకోవాలి, రూ. 25,000/-ల ప్రోత్సాహాన్ని వెంటనే అమలుపరచాలి, ప్రతి మగ్గానికి 200 యూనిట్లు కరెంటు ఫ్రీ వెంటనే అమలుపరచాలి. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత స్కూల్ యూనిఫామ్ చేనేత సహకార సంఘాల ద్వారా కొనాలి. చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం 5 వేల కోట్ల రూపా యల బడ్జెట్‌ను కేటాయించాలి. చేనేత సమస్యల పరిష్కారం కోసం ఒక ఎక్స్పర్ట్ కమిటీని నియమించమని, ఆంధ్రప్రదేశ్ చేనేత సమాఖ్య ప్రతి నిధులకు ఎక్స్పర్ట్ కమిటీలో అవకాశం కల్పించాలని కోరుతు న్నామన్నారు.

# తేనెటీగల దాడికి పామాయిల్ ఫీల్డ్ అసిస్టెంట్ రమణ మృతి

**చాట్రాయి, మేజర్ న్యూస్:** గోద్రెజ్ పామాయిల్ కంపెనీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గుండ్ల వెంకటరమణ తేనెటీగల కుట్టడంతో మృతి చెందారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలవ సమీపంలో ఉద్యోగ విధులు నిర్వహిస్తున్న సమయంలో తేనెటీగలు వెంకటరమణ పై దాడి చేశాయి. స్థానికులు వెనువెంటనే విస్సన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటరమణ కామవరపుకోట చింతలపూడి తదితర మండలాలలో విధులు నిర్వహించారు. వెంకటరమణ విధులు నిర్వహించే చోట రైతులతోపాటు మిగతా ప్రజలతో కూడా మమేకమై ఉండేవారని పలువురు పేర్కొన్నారు. వెంకటరమణ మృతి విషయం తెలిసిన పలువురు రైతులు, సన్నిహితులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా ప్రభుత్వం అడుగులు

– వైద్యానికి, ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే నల్లమిల్లి
– హోమియోపతి ఆసుపత్రికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**అనపర్తి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని, రామవరంలో 20 లక్షల రూపాయలతో నిర్మించబోయే హోమియోపతి ప్రభుత్వ ఆసుపత్రి భవనం కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడు హోమియో హాస్పిటల్స్ ఏర్పాటు చేసి వైద్యులను నియమించడం జరిగిందని, ముఖ్యంగా రామవరం గ్రామంలో చక్కటి వైద్యాధికారులు రావడంతో ప్రజలు కూడా హోమియో వైద్యానికి అలవాటు పడటం జరిగిందని, అప్పటి వరకు వారికి హోమియో వైద్యంపై వారికి సరైన అవగాహన లేదని, కేంద్ర ప్రభుత్వం ఆయుష్ శాఖ హోమియోను ప్రోత్సహిస్తుందని చెప్పడంతో వారు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రాష్ట్రంలో హోమియోని గానీ, ఆయుర్వేదాన్ని గానీ ప్రోత్సహించాలని కృషి చేయడం అందులో భాగంగానే డిప్యుటేషన్ పై డాక్టర్ దివ్యను ఇక్కడికి తీసుకురావడం ఆమె కూడా చాలా చక్కగా వైద్యాన్ని అందిస్తూ ఉండడంతో ఇక్కడ ఓపి 50 వరకు పెరిగిందని అన్నారు. ఇక్కడ నిధులు మంజూరు అయ్యి మూడు నెలలు అయిందని , కానీ డాక్టర్ లేకుండా శంకుస్థాపన చేయడం వలన చులకనగా ఉంటుందని భావించి నేను శంకుస్థాపనని వాయిదా వేయడం జరిగింది. ఇప్పుడు డాక్టర్ రాగానే శంకుస్థాపన చేసామని అన్నారు. వైద్యం, ఆరోగ్యం వీటికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రపంచంలోని అనేక దేశాలు భారతదేశం వైపు మొగ్గు చూపుతున్న పరిస్థితుల్లో వైద్య విద్యలోని మెళకువలు అన్ని మన వేదాల్లో ఉన్నాయని అనేక మంది చెబుతున్నారని, మన భారతీయ సనాతన సంస్కృతిలో పురాణాల్లో వైద్యానికి ఎంత ప్రాధాన్యతనిచ్చారో మనం అర్థం చేసుకోవాలని,వైద్య ఖర్చు తగ్గించడమే కాకుండా సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఉండేందుకు ప్రభుత్వాలు ఈ విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు,అనపర్తి మండల,రామవరం గ్రామ కూటమినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదకర స్థితిలో కింద్ర కేబుల్ బ్రిడ్జ్ - ఎస్సై శివకుమార్



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ప్రమాదకర స్థితిలో కింద్ర కేబుల్ బ్రిడ్జ్ ఉందని ఒకేసారి ఎక్కువ మంది ప్రయాణించడం అపాయమని రాజవొమ్మంగి ఎస్సై ఎస్ఐ శివకుమార్ అన్నారు. కింద్ర, కింద్రకాలనీకి వారధిగా ఉన్న కేబుల్ బ్రిడ్జ్ పాడైపోయే స్థితిలో ఉన్నందున స్థానిక తాసిల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరిరావు ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగిందన్నారు. ఈ మేరకు గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. కేబుల్ బ్రిడ్జ్ దగ్గర ఇరువైపుల హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో కింద్ర సెక్రటరీ ఉన్నారు.

## రాజవొమ్మంగి పిఎస్‌లో 9 మందిపై బైండోవర్ కేసులు



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లో 9 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ మీడియాకు తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అసాంఘిక కార్యక్రమాలలో పాత నేరస్తులు పాల్గొనకుండా మంగళవారం 9 మంది వ్యక్తుల పై బైండ్ ఓవర్ కేసు నమోదు చేసి రాజవొమ్మంగి తాసిల్దార్ ముందు హాజరు పరచడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఇప్పటివరకు 28 మందిపై బైండోవర్ కేసులు పెట్టడం జరిగిందన్నారు.

## జంతుహింసకు పాల్పడితే కఠిన చర్యలు

– మండల తాసిల్దార్ కుసరాజు



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** సంక్రాంతి సందర్భంగా జంతు హింసకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మండల తాసిల్దార్ కుసరాజు అన్నారు. మంగళవారం రామలింగేశ్వర రావు తో కలిసి ఏలేశ్వరం మండల పరిధిలోని కోడిపందాలు నిర్వహించే పలు అనుమానాస్పద ప్రాంతాలలో ఫ్లెక్సీలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కుసరాజు మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు సూచనలతో జంతు హింస నివారణ పై ప్రచారం చేపట్టామన్నారు. సంక్రాంతి గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే కోడిపందాలపై ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించిందని, అలాంటి కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే చట్టపరంగా కఠినమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. సంక్రాంతి సందర్భంగా తమ కుటుంబాలతో ప్రతి ఒక్కరు సంతోషంగా గడపాలని ఈ సందర్భంగా సూచించారు. ఏలేశ్వరం మండల పరిధిలోని మర్రి వీడు, జె.అన్నవరం,తూర్పు లక్ష్మీపురం, లింగంపర్తి, భద్రవరం, పేరవరం, తిరుమాలి, ఎర్రవరం, పెద్దనాపల్లి,సిరిపురం తదితర గ్రామాలలో ప్రజలకు ఫ్లెక్సీల ద్వారా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ నిషేధించిన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ పొన్నాలు రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్రేయపురం ఉత్సవంతో కోనసీమకు ముందే సంక్రాంతి





- డ్రాగన్ పడవల పోటీలతో ఈ ప్రాంతంలో టూరిజం అభివృద్ధి వేగవంతం
- ఉత్సవాలను విజయవంతం చేయడంలో ఎమ్మెల్యే బండారు కృషి అమోఘం
- హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రులు కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్

**ఆత్రేయపురం,మేజర్న్యూస్ :**ఆత్రేయపురం ఉత్సవం సంక్రాంతి సంబరాలతో కోనసీమకు మకర సంక్రాంతి మూడు రోజుల ముందే వచ్చిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంశాఖ మాత్యులు వంగలపూడి అనిత, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెస్ఎంఈ సెర్ప్,ఎన్నారై మంత్రి కొండపల్లి శ్రీనివాస్లువ్యాఖ్యానించారు. మంగళవారం లొల్లలాకుల వద్ద ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్టివల్,ఎగ్జిబిషన్లను ఆమె పరిశీలించారు. అనంతరం డ్రాగన్ పడవల సెమీఫైనల్స్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేరళ మించిన అందాలు కోనసీమలో ఉన్నాయని ఆత్రేయపురం ఉత్సవం ప్రపంచానికి చాటిందని తెలిపారు. ఆత్రేయపురం పూతరేకులకు ప్రసిద్ధిఅని,చిన్నగ్రామం అయినా పూతరేకులతో తెలుగు సంస్కృతిలో ప్రత్యేక స్థానం సాధించిందని,దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు పొందిందని అన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణ కోసం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేసినకృషిఅమోఘమనిఅన్నారు.ఈ ప్రాంత మంతా టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విశేషంగా కృషిచేస్తున్నారని తెలిపారు.వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి వైభవంతో ఈప్రాంతమంతా అభివృద్ధిచెందుతుందని, ఆత్రేయపురం చుట్టుపక్కల టూరిజం అభివృద్ధికి అన్నివిధాల సహకరిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. లొల్ల లాకుల వద్ద శాశ్వతంగా టూరిజం అభివృద్ధికి కావలసిన కార్యక్రమాలు చేపట్టాలన్న ఎమ్మెల్యే ఆలోచనలకు సహకరిస్తామన్నారు. టూరిజం అభివృద్ధి చెందితే స్థానికులకు ఉపాధి లభిస్తుందని, యువతకు ఉద్యోగాలు వస్తాయని అన్నారు. కేరళలోనే కాకుండా కోనసీమలో సైతంపడవల పోటీలు అద్భుతంగా నిర్వహించవచ్చనిఈఉత్సవాల ద్వారాఅందరికీ తెలిసిందన్నారు. సంక్రాంతి సంబరాలకు కోనసీమకు రావడం ఆనందంగా ఉందని, టూరిజం అభివృద్ధికిఇక్కడ అన్నిఅవకాశాలుఉన్నాయనిరాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అనంతరం హోంమంత్రి వంగలపూడి అనిత గాలిపటాలను ఎగురవేసి గాలిపటాల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యేలు వేగుళ్ళ జోగేశ్వరరావు, దాట్ల బుచ్చిరాజు, రాజోలు తెదేపా ఇన్చార్జి గొల్లపల్లి అమూల్య, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీవో శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలను, కమిటీ సభ్యులను ఎమ్మెల్యే బండారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు,మండల తెలుగు యువత అధ్యక్షులు అనిల్ కూటమి నాయకులు ఆకుల రామకృష్ణ, పి.ఎస్.రాజు, జుజ్జవరపు హరిబాబు, ముళ్ళపూడి భాస్కరరావు,ఎంపీడీవో బికెఎస్ఎస్ వెంకట్రామన్, తాసిల్దార్ శ్రీరామచంద్ర మూర్తి, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణానికి జమాల్ ఖాన్ శంకుస్థాపన



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండలంలోని మోతుగూడెంలో మంగళవారం ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణానికి మోతుగూడెంలో ఏర్పాటుచేసిన శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు మరియు జెకేసి ట్రస్ట్ చైర్మన్, టిడిపి చింతూరు మండల అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ హాజరై శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి నిర్మాణం రూ.30 లక్షలతో చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆయుర్వేదం అందరికీ అందుబాటులో ఉండేలా ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా దీర్ఘకాలిక రుగ్మతలను అరికట్టేలా దోహదపడుతుందని ఆయుర్వేదానికి ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు ఆసుపత్రులు సంబంధిత వైద్యులను నియమించేందుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయటం పట్ల చాలా ఆనందకరంగా ఉందని ఆరోగ్యానికి మించిన ఆస్తి ఏది లేదని, ఆరోగ్యకరంగా ఉంటే అంతకంటే మించిన భాగ్యం ఉండదని, ఆయుర్వేదాన్ని అందరూ ఆదరించి సద్వినియోగం చేసుకోవాలని జమాల్ ఖాన్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుండం శ్రీనివాస్ దొర, సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి చిన్న, వైద్యులు విజ్ఞు, షఫీ, వార్డు సభ్యులు దేవుడు, ముండ్రేటి వెంకటేశ్వర్లు. కార్యదర్శి గుంపెనపల్లి మోహన్, మార్కెట్ కమిటీ సభ్యుడు పి.సాల్మన్ రాజు, గ్రామ పెద్దలు ఉలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం నూతన జిల్లా జాయింట్ కలెక్టర్గా స్మరణ్ రాజ్ బాధ్యతలు స్వీకారం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం నూతన జిల్లా జాయింట్ కలెక్టర్గా అదనపు బాధ్యతలు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బచ్చు స్మరణ్ రాజ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వారి ఛాంబర్లో రెండు గంటల 55 నిమిషాలకు పోలవరం జిల్లా రంపచోడవరం నూతన జాయింట్ కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ పోలవరం జిల్లా పరిధిలో వివిధ రకాల గిరిజన సమస్యలు, రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు పర్యవేక్షించి ఆయా సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కొత్త జిల్లాను అభివృద్ధి చేయుటకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు నూతన జాయింట్ కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు లబ్ధిదారులకు సకాలంలో అందించే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. నూతన జిల్లా జాయింట్ కలెక్టర్ సీటీసీలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డి.ఎన్.వి.రమణ సంతకాలు చేయించడం జరిగింది. నూతన జిల్లా జాయింట్ కలెక్టర్ను మర్యాద పూర్వకంగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, పీహెచ్ఓ దేవ దానం, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సరిత, ఈఈలు ఐ.శ్రీనివాసరావు, సుబ్బయ్య, ఎస్ఓ మార్తమ్మ, డిప్యూటీ తహసిల్దారులు స్వామి, రవీంద్రబాబు, విశ్వనాథ్, వివిధ అధికారులు, అభినందనలు తెలియజేయడం జరిగింది.

## శ్రీ సత్యదేవుని దర్శించుకున్న పట్నా హైకోర్టు జస్టిస్ అనుపమ చక్రవర్తి



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనార్థం పట్నా హైకోర్టు జస్టిస్ అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతముగా సన్నిధికి విచ్చేశారు. వీరికి ముందుగా దేవస్థానం డిప్యూటీ కమిషనర్ బాబురావు, ఏఇఓ దామెర కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా డిప్యూటీ కమిషనర్ బాబురావు శ్రీ స్వామివారి శేష వస్త్రము, ప్రసాదము, చిత్ర పటము అందజేశారు.

## తాడిపూడిలో క్షత్రియ సామాజిక భవనం ప్రారంభం

- ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు, ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే బుచ్చిబాబు





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం మండలం తాడిపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన కోసూరి రామకృష్ణం రాజు క్షత్రియ కమ్యూనిటీ భవనాన్ని మంగళవారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ హరీష్ చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షత్రియ సామాజిక వర్గీయులు సంఘటితంగా భవనం నిర్మించుకోవడం హర్షణీయం అని అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుత్తుల సాయి, రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య సాయిబాబు రాజు, కోసూరి వెంకట సుబ్బరాజు, జయ బాబు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, గ్రామ టిడిపి అధ్యక్షులు కూసం పూడి రమేష్ రాజు, అంబుల శ్రీనివాస్ గాదిరాజు, ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** స్థానిక మహాత్మా గాంధీ జూనియర్ కళాశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది 2000 – 2001 బ్యాచ్ కు చెందిన విద్యార్థులంతా సంక్రాంతి సందర్భంగా పూర్వం విద్యాభ్యాసం చేసిన మహాత్మాగాంధీ జూనియర్ కళాశాలకు చేరుకున్నారు. 25 సంవత్సరాల క్రితం కళాశాలలో ఆడుతూ... పాడుతూ విద్యాభ్యాసం చేసిన మదుర క్షణలు గుర్తు చేసుకుంటూ పూర్వపు స్మృతులు నెమరు వేసుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ పి.ఎస్.రాజు, ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బందితో ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపారు. ఆత్మీయ సమ్మేళనంలో జీవన ప్రయాణంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులు సంతోషాలు, వృత్తిపరంగా ఉన్నతలను గూర్చి తోటి విద్యార్థులతో నెమరు వేసుకున్నారు రోజంతా కళాశాల ప్రాంగణంలో ఉల్లాసంగా గడిపి సాయంత్రం భారమైన హృదయాలతో ఒకరికి ఒకరు వీడ్కోలు తెలుపుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో ఆర్ఎక్స్ 100 దర్శకుడు వేగేశ్న అజయ్ భూపతి, ముదునూరి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.